ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 22 మార్చి 2024





కొండపావులూరు సర్వే నెంబర్ 34లో తాటిచెట్టంత లోతున అక్రమ తవ్వకాలు

# కొండెక్కిన కోడ్..!

## కొండపావులూరులో రాత్రింబవళ్లు మట్టి, గ్రావెల్ తవ్వకాలు

- కోడ్ వచ్చిన దగ్గర నుంచి మరింత ఎక్కువగా..
- రెచ్చిపోతున్న అధికార పార్టీ మైనింగ్ మాఫియా
- మంగలమ్మ చెరువులోనూ అదే పరిస్థితి
- వందలాది ట్రాక్టర్లలో మట్టి ఇటుక బట్టీలకు తరలింపు
- కట్టలేరులో భారీగా ఇసుక తవ్వకాలు.. పట్టని అధికారులు
- నున్నలో కాల్వపై కట్టడం.. బస్టాప్ అంటూ కలరింగ్

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టేసుకుంటున్నారు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు. కొద్దిరోజుల్లో ఎన్నికలు జరుగుతాయి.. అధికారం చేతికొస్తుందా, రాదా.. అనే మీమాంసలో మరిన్ని అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. రెండు జిల్లాల్లో భారీగా అక్రమ క్వారీయింగ్‌కు తెరతీశారు. ఈ అక్రమ వ్యవహారాల్లో స్థానిక అధికార యంత్రాంగాలు కూడా వైసీపీ నేతలకు సహకరిస్తుండటంతో స్థానికులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేని పరిస్థితి ఏర్పడింది.

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** గన్నవరం మండలం కొండపావులూరు సర్వే నెంబర్ 6 సమీపంలోని సర్వే నెంబర్ 34లో ఎర్రమట్టి, గ్రావెల్‌పై అధికార పార్టీ ప్రజాప్రతినిధి అనుచరులు తెగబడ్డారు. అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. 'మళ్లీ మాదే అధికారం..' అంటూ రెవెన్యూ అధికారులపై కత్తిపెట్టి మరీ అనధికారికంగా క్వారీయింగ్‌కు శ్రీకారం చుట్టారు. ఇక.. ఎన్నికల కోడ్ వచ్చాక ఈ తవ్వకాలను మరింత ముమ్మరం చేశారు. అతి తక్కువ కాలంలోనే ఎకరాల కొద్దీ తవ్వేశారు. ఇందుకోసం భారీగా ఎక్స్‌కవేటర్లను ఉపయోగిస్తున్నారు. గతంలో రాత్రిపూట తవ్వకాలు జరిపేవారు. పగటిపూట ఎక్స్‌కవేటర్లను పొలాల్లో దాచేవారు. ఎన్నికల కోడ్ వచ్చాక బరితెగించి రాత్రీ పగలు తేడా లేకుండా తవ్వేస్తున్నారు. నిర్దేశిత ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా 50 అడుగులకు పైగా మట్టిని, గ్రావెల్‌ను తవ్వేశారు. వందల సంఖ్యలో టిప్పర్లు ఈ మట్టిని తీసుకెళ్తున్నాయి. ఈ మట్టిని ఇటుక బట్టీలు, రియల్ వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

### 'రెవెన్యూ' సహకారం

అధికార పార్టీ మాఫియా చేపడుతున్న ఈ దురాగతాలకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారు. వారి దృష్టికి వచ్చినా పట్టించుకోవటం లేదు. ఈ భూమిలో విద్యుత్ శాఖకు సంబంధించిన విద్యుత్ పోల్స్ ఉన్నాయి. ఈ పోల్స్ చుట్టూ కొద్దిమొత్తంలో వదిలేసి 50 అడుగుల లోతున తవ్వేశారు. ఇది ప్రమాదకరమంటున్నారు స్థానికులు. వర్షాలు కురిస్తే విద్యుత్ స్తంభాల కింద ఉన్న మట్టి కుంగి, కొట్టుకుపోతే ప్రమాదం ఏర్పడుతుందంటున్నారు. ఈ విద్యుత్ స్తంభాల నుంచి స్థానికంగా ఉంటున్న రైతుల పొలాల్లోకి, కొండపావులూరులోని ఎన్‌డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎంకు కూడా విద్యుత్ లైన్లు వెళ్తాయి. ఈ విషయాన్ని విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదు.



కట్టలేరు నుంచి తవ్వి తెచ్చిన ఇసుక మార్కెట్‌లో అమ్మకాలు

### ఎక్కడపడితే అక్కడ..

- గన్నవరం మండలం వీరపనేనిగూడెం మంగలమ్మ చెరువులో కూడా భారీగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇటుక బట్టీల కోసం ఈ మట్టిని తరలిస్తున్నారు. బట్టీల దగ్గర మట్టి గుట్టలు కొండలను తలపిస్తున్నాయి. మంగలమ్మ చెరువు తవ్వకాలకు స్థానిక రెవెన్యూ అధికారులే అనధికారికంగా అనుమతులు ఇచ్చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. వారం రోజులుగా భారీ ఎత్తున చెరువులో మట్టి తోడేస్తున్నారు.
- నున్న గ్రామంలోని సాయిబాబా గుడి వెంబడి మెయిన్ రోడ్డు వద్ద మురుగు కాల్వ ఉంది. బస్టాప్ నిర్మిస్తున్నామన్న పేరుతో కాల్వపై కట్టడాలు చేపడుతున్నారు.
- గంపలగూడెం మండల పరిధిలోని కట్టలేరులో ఇసుక అక్రమ తవ్వకాలు భారీగా జరుగుతున్నాయి. స్థానిక రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆశీస్సులతోనే ఈ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై తరచూ స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవటం లేదు.

# జడ్పీ సీఈవోపై వేటు



- స్థానిక జిల్లాలో ఉండకూడదన్న ఎన్నికల సంఘం
- కలెక్టర్‌ను ప్రశ్నించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్
- చార్జి అప్పగించి జీఏడీకి సరెండ్ కావాలని కలెక్టర్ ఆదేశం
- బాధ్యతల నుంచి రిలీవైన జ్యోతిబసు [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]
- అధికార పార్టీ పెద్దలతో సత్సంబంధాలు.. సహకారాలు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** సొంత జిల్లాలో ఉంటూ ఎన్నికల బాధ్యతలు నిర్వహిస్తున్న ఉమ్మడి కృష్ణాజిల్లా జడ్పీ సీఈవో జ్యోతిబసుపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. స్పందించిన కృష్ణా కలెక్టర్ రాజాబాబు.. చార్జి అప్పగించి సరెండ్ కావాలని ఆదేశించారు. దీంతో జ్యోతిబసు తన బాధ్యతల నుంచి రిలీవై జీఏడీకి సరెండ్ అయ్యారు. జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందరావుకు ఆయన బాధ్యతలను అదనంగా అప్పగించారు.

**ఆది నుంచీ వివాదాస్పదుడే..**

ఎన్నికల నేపథ్యంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు ఇక్కడే ఉండటానికి వీలుగా పావులు కదిపారు. ఇందుకోసం అధికార పార్టీ పెద్దలను ఆశ్రయించి కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చారు. ఎన్నికల విధులు లేకుండా జాగ్రత్త పడ్డారు. ఒకసారి ఎన్నికల డ్యూటీ వేసినప్పటికీ తప్పించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఎన్నికల డ్యూటీ వేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం స్థానికంగా ఉంటూ కదలకపోవటంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలో తన విషయంలో స్థానికత వర్తించదని జడ్పీ సీఈవో చెప్పుకొచ్చారు. సన్నిహితుల దగ్గర మాత్రం తాను ఇక్కడి నుంచి కదిలేది లేదని, తననెవరూ కదల్చలేరన్నారు. ఈ క్రమంలో అసలు వాస్తవాలు ఏమిటన్న దానిపై ఈసీకి ఫిర్యాదులు అందాయి. రెండు రోజుల కిందట రాష్ట్ర ఎన్నికల అధికారి నిర్వహించిన వీసీలో జడ్పీ సీఈవోలు సొంత జిల్లాలోనే కొనసాగటంపై చర్చ జరిగింది. ఆయా జిల్లాల కలెక్టర్లను ప్రశ్నించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని చెప్పటంతో కృష్ణా కలెక్టర్ రాజాబాబు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. అధికార పార్టీకి వీర విధేయుడిగా ముద్రపడిన ఈ జడ్పీ సీఈవో తీరుపై విపక్షాలు మొదటి నుంచీ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అధికార పార్టీ తరఫున పెడన నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ భర్త అడుగులకు మడుగులొత్తారు. జడ్పీ ఉద్యోగులను ఆయన పార్టీ కార్యాలయంలో పనుల కోసం నియమించటం కూడా తీవ్ర వివాదాన్ని సృష్టించింది. ఒక్క పెడన నియోజకవర్గమే కాకుండా ఉమ్మడి జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల్లో కూడా అధికార పార్టీ అభ్యర్థులకు సహకరించేలా జడ్పీ సీఈవో జ్యోతిబసుకు అధికార పార్టీ పెద్దలు బాధ్యతలు అప్పగించారని విపక్షాలు ఆరోపించాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘానికి వరుసగా ఫిర్యాదులు వెళ్లాయి.

# ఎనిమిది మంది వలంటీర్లపై వేటు

**మచిలీపట్నం/మోపిదేవి/కోడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) :** నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వలంటీర్లపై అధికారులు చర్యలు ప్రారంభించారు. జిల్లాలో గురువారం ఎనిమిది మంది వలంటీర్లపై వేటు వేశారు. బందరు మండలం చిన్నాపురం పంచాయతీలో బందరు అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి ఈనెల 19వ తేదీన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో వలంటీర్లు తిరువీధుల నందిని, నాగిడి ఊర్వశి, దాసరి రత్నకుమారి, గుమ్మడి భవానీ, జన్ను శ్రీలక్ష్మి, జి.సురేష్ పాల్గొన్నారు. దీనిపై విచారణ చేసిన ఎంపీడీవో ఎ.బాలకృష్ణారావు ఆరుగురు వలంటీర్లను విధుల నుంచి తొలగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వలంటీర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు, క్లస్టర్ రికార్డులను స్వాధీనం చేసుకోవాలని చిన్నాపురం పంచాయతీ కార్యదర్శికి ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు. గిలకలదిండిలో ఎమ్మెల్యే పేర్ని నాని బుధవారం వైసీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వలంటీర్ లంకె ఏడుకొండలు పాల్గొన్నారు. ఈ వీడియో బయటకు రావడంతో చర్చనీయాంశమైంది.

**● మోపిదేవిలో ఒకరిపై..**

మోపిదేవి మండలంలోని పెదప్రోలు పంచాయతీ శివారు కప్తానుపాలెంలో అక్రమంగా 66 మద్యం సీసాలు నిల్వ ఉంచి పోలీసు దాడిలో పట్టుబడిన డి.వేణును విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో కె.శ్రీనివాసరావు తెలిపారు.

**● కోడూరులో ఒకరిపై..**

కోడూరు సచివాలయం-2 పరిధిలోని వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న చిట్టిప్రోలు నాగేంద్రబాబును విధుల నుంచి తొలగించినట్టు కోడూరు మండల ఎంపీడీవో ఆర్.శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ ప్రసంగాల్లో పాల్గొన్నారని సోషల్ మీడియాలో వచ్చిన కథనంపై విచారణ అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు వలంటీర్‌ను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో తెలిపారు.

# అయ్యో.. అభ్యర్థి!

## 52 రోజులపాటు ఎన్నికల ఖర్చుపై అభ్యర్థుల బెంబేలు

- ప్రచారంలో పాల్గొంటే ఒక్కొక్కరికి రోజుకు రూ.600
- మే 13వ తేదీ వరకు ఎంత ఖర్చు అవుతుందోనని అభ్యర్థుల లెక్కలు
- వేరే పార్టీవారు అధికంగా ఇస్తామంటున్నారని బేరాలు మొదలు
- సభలకు జనసమీకరణ కోసం మరో ఖర్చు
- నామినేషన్ల ర్యాలీకీ భారీగానే బ్యాండు..
- ఇంత ఖర్చు చేసినా గెలుస్తామో లేదోనని వైసీపీ అభ్యర్థుల్లో ఉత్కంఠ




**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** ఎన్నికల షెడ్యూలు ఈనెల 16వ తేదీన విడుదలైంది. మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ప్రచారంలో పాల్గొంటున్నారు. దీంతో రోజువారీ ఎన్నికల ప్రచార ఖర్చు తడిచి మోపెడవుతోంది. మరో 52 రోజలపాటు ఎన్నికల ప్రచార ఖర్చును ఎలాభరించాలనే అంశంపై అభ్యర్థులు తలమునకలవుతున్నారు.

### రోజుకు రూ.2 లక్షలపైనే ఖర్చు

ఎన్నికల షెడ్యూలు విడుదలకు ముందే బందరు, పెడన, పామర్రు, నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అభ్యర్థులు ఓటర్లను కలుసుకునేందుకు పర్యటనలు జరుపుతున్నారు. పార్టీ ప్రచారంలో పాల్గొనేవారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనంతో పాటు రోజుకు రూ.600, ప్రచారం ముగిశాక మద్యం ఇతరత్రా ఖర్చులు పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రచారంలో భాగంగా ఏదైనా ప్రాంతాలకు వెళితే అక్కడ అభ్యర్థులకు స్వాగత కార్యక్రమాలకు సంబంధించిన ఖర్చును ముందస్తుగానే అభ్యర్థులు పంపి తగిన ఏర్పాట్లు చేసుకోవాల్సి వస్తోంది. రోజుకు మూడు, నాలుగు గ్రామాల్లో పర్యటిస్తే లక్ష నుంచి రెండు లక్షలు ఖర్చవుతోంది.

### గ్రామ పెద్దల కోసం..

గ్రామాల్లో ఓటర్లతో మాట్లాడేందుకు, వారిని తమ పార్టీకి ఓట్లు వేసేలా ఒప్పించేందుకు ఆయా సామాజికవర్గాలకు చెందిన పెద్దలను వ్యూహకర్తలుగా ప్రత్యేకంగా నియమించుకున్నారు. వీరు తిరిగేందుకు వాహనాలు సమకూర్చడంతోపాటు ఇతరత్రా ఖర్చులన్నీంటిని పెట్టుకోవాల్సి వస్తోంది. ఈ పెద్దమనుషులు తమ సామాజికవర్గానికి చెందిన ఓటర్లతో మాట్లాడి ఓట్లు వేయిస్తామని తమదైన శైలిలో చెబుతూ రెండు ప్రధాన పార్టీల అభ్యర్థుల నుంచి నగదు అందినకాడికి తీసుకుంటున్నారు.

### సభలు, నామినేషన్లకు జనసమీకరణ కోసం

మే 11వ తేదీ వరకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే ఖర్చు కోట్లలో అవుతుందనే భయం అభ్యర్థులను వెంటాడుతోంది. నామినేషన్లు వేసే సమయంలో జన సమీకరణ, పార్టీ అధినేతలు వస్తే జరిగే బహిరంగసభలకు ఎంతమేర ఖర్చు చేయాలనే అంశంపైనా అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు.

### సమస్యల పరిష్కారానికి హామీలతో పెరుగుతున్న ఖర్చు

ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాలు, వార్డుల్లో తిరుగుతూ అక్కడున్న సమస్యలపై అభ్యర్థులు, వారి అనుచరులు అడిగి తెలుసుకుంటున్నారు. స్థానికులు చెప్పిన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తే లక్షల్లో ఖర్చుచేయాల్సి వస్తోంది. దీంతో పాటు యువతకు క్రికెట్ కిట్లు, వలంటీర్లకు తాయిలాలు, నగదు పంపిణీ, ఇతరత్రాలకు మరింతగా ఖర్చు చేయాల్సి వస్తోంది. బందరు, ఇతర నియోజకవర్గాల్లో వైసీపీకి అనుకూలంగాలేని ప్రాంతాల్లో రాత్రికి రాత్రే మద్యం కేసులను పంపి ఓటర్లను ఆకర్షించేందుకు తమవంతుగా అభ్యర్థులు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎన్నికలు దగ్గరపడిన సమయంలో ఓటర్లకు నగదు, మద్యం, ఇతరత్రా వస్తువులు పంపిణీ చేయాల్సి ఉండటంతో మరింతగా ఖర్చు పెట్టాల్సి రావడం ఖాయంగా కనిపిస్తోంది.

# హౌస్‌హోల్డ్ రిజిస్టర్లు ఏవి?

- ఎన్నికల కోడ్ వచ్చాక వెనక్కి ఇవ్వని వలంటీర్లు
- అధికార పార్టీ నాయకుల ఇళ్లలో ఉన్నట్టు అనుమానాలు
- ప్రతి కుటుంబం పూర్తి సమాచారం వారి చేతుల్లోనే..
- సచివాలయాల అడ్మిన్‌ల ఉదాసీన వైఖరి



ఎన్నికల కోడ్ వచ్చి 96 గంటలవుతున్నా కోడ్ అమలులో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. గ్రామ/వార్డుల్లో వలంటీర్ల వద్దనున్న హౌస్ హోల్డ్ రిజిస్టర్‌లను తిరిగి తీసుకోవడంలో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో... వారి వెనుక ఉండి నడిపిస్తున్నది ఎవరో.. అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వైసీపీ నాయకులు ఇళ్లలో సదరు రిజిస్ట్రర్‌లను పెట్టుకుని ఆయా కుటుంబాల వివరాలను తస్కరిస్తున్నట్టు అనుమానం వ్యక్తమవుతోంది.

**గుడివాడ :** ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ చొప్పున జిల్లా వ్యాప్తంగా 9,400 మంది వలంటీర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వలంటీర్లు వారి పరిధిలోని 50 ఇళ్ల తాలుకు పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హౌస్‌హోల్డ్ రిజిస్టర్‌లో నమోదు చేయించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందులో పొందుపరిచారు. తరువాత డిజిటలైజేషన్ పేరుతో జీఎస్‌డబ్ల్యూఎస్ వలంటీర్ అనే మొబైల్ అప్లికేషన్‌లో కుటుంబ సర్వే పూర్తిస్థాయి వివరాలు, ప్రభుత్వం నుంచి పథకాల ద్వారా పొందిన లబ్ధి ఎంత అనే వివరాలను పొందుపరిచారు.

**● అడ్మిన్‌ల ఉదాసీన వైఖరి?**

ఎన్నికల కోడ్ వచ్చిన రోజునే ఉన్నతాధికారులు వలంటీర్ల వద్దనున్న హౌస్‌హోల్డ్ రిజిస్టర్‌లను వెనక్కి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. రిజిస్టర్‌లు వెంటనే ఆయా సచివాలయాల అడ్మిన్‌లకు అందజేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఆదేశాలు అమలవుతున్న దాఖలాలు లేవు. కొన్ని సచివాలయాల్లో వలంటీర్‌లు రిజిస్టర్‌లను అందజేసినట్టు చెబుతున్నా అడ్మిన్‌లు మాత్రం అందలేదని పేర్కొంటున్నారు. దీని వెనుక ఆంతర్యమేమిటో అంతు పట్టడం లేదు. అసలు రిజిస్టర్‌లను తీసుకోవాలనే సమాచారం కూడా లేదని కొందరు అడ్మిన్‌లు చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. అడ్మిన్‌లకు సదరు శాఖ నుంచి ఏయే సంకేతాలు వెళ్లాయో తెలియడం లేదు. వలంటర్‌ల వద్ద ఉన్న ప్రభుత్వ మొబైళ్లను వెనక్కి తీసుకోవాలని ఎన్నికల కమిషన్ నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని జిల్లా ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**● రిజిస్టర్‌లు ఎక్కడ?**

వైసీపీ నాయకులు, సానుభూతిపరులకు చెందిన వారే వలంటీర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కుటుంబాల వివరాల రిజిస్టర్‌లు ఏమైనట్టు? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. కొందరు అధికారులైతే అసలు రిజిస్ట్రర్‌లు ఉన్నాయా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డిజిటలైజేషన్‌కు మునుపు ఉన్న రిజిస్టర్‌లు కొన్నిచోట్ల వెనక్కి తీసుకున్నామని, మరికొన్ని చోట్ల వలంటీర్‌ల వద్దే ఉన్నాయని అధికారులు భిన్న సమాధానాలు చెబుతున్నారు.

**● వలంటీర్‌లకు ఎందుకు?**

ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి వలంటీర్‌లకు ముఖ హాజరును కూడా తీసివేశారు. గుడివాడ మందపాడులోని 21వ వార్డు సచివాలయంలో గురువారం సచివాలయ అడ్మిన్ హాజరు వేయాలనే పేరుతో వలంటీర్‌లను మధ్యాహ్నం వరకు సచివాలయాల్లో కూర్చోపెట్టారు. ఎన్నికల కోడ్ తరువాత వలంటీర్లను విధుల నుంచి, హాజరు నుంచి మినహాయించారు. ఈ క్రమంలో అసలు హాజరే వేయాల్సిన అవసరం లేనప్పుడు వలంటీర్‌లను మధ్యాహ్నం దాకా ఎందుకు ఉంచారో, వారి సేవలను ఎక్కడ వినియోగించారో అడ్మిన్‌కు తెలియాలి.

**అధికార పార్టీ చేతుల్లో రిజిస్టర్‌లు**

పట్టణ ప్రాంతాల్లో మాత్రం రిజిస్టర్‌లు వైసీపీ నాయకుల వద్ద ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. కొన్ని పంచాయతీల పరిధిలో గ్రామ సర్పంచ్‌లు, అధికార పార్టీ నాయకులు వీటిని తీసుకున్నట్టు వలంటీర్లు పేర్కొంటున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వలంటీర్‌లు డేటాను వినియోగించుకుని అక్రమాలకు పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అధికార పార్టీ నాయకులు తమ డేటాను దేనికి ఉపయోగిస్తారో అనే భయాందోళనలో ప్రజలున్నారు. ప్రజల పూర్తిస్థాయి డేటా ఉన్న రిజిస్టర్‌లు ఏమయ్యాయో, ఎవరి వద్ద ఉన్నాయో కూడా అధికారులు సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నారు.



# పల్లకీలో.. ఆదిదంపతులు

గంగా సమేత దుర్గామల్లేశ్వరుల పల్లకీ ఉత్సవం గురువారం కనులపండువగా జరిగింది. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈవో రామారావు పాల్గొన్నారు. ఉత్సవమూర్తులను ఉంచిన పల్లకీని ఈవో మోశారు. అనంతరం విశేషార్చనలు జరిగాయి. హారతులు సమర్పించారు. కాగా, దుర్గగుడి ప్రాంగణంలో ఎండ వేడిమికి భక్తుల కాళ్లు కాలకుండా హీట్ ప్రూఫ్ పెయింటింగ్‌లు వేశారు. భక్తులు నడయాడే అన్ని ప్రదేశాల్లోనూ ఈ పెయింట్లు వేశారు. - వన్‌టౌన్



### రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-23 (శుక్ర)
సహర్ (ఉదయం) : 4-50(శని)



పూర్ణ చంద్రరావు శిష్య బృందం నృత్య అభినయం

## రసరమ్యం కూచిపూడి అభినయం



మంజూష నాట్య భంగిమ

**కూచిపూడి, మార్చి 21 :** బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా రెండవ రోజైన గురువారం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళావేదికపై నిర్వహించిన నాట్యాంశాలు రసరమ్యంగా సాగాయి. తొలుత చింతా రవిబాలకృష్ణ శిష్యబృందం వర్షిత వర్మ, సాయి భవ్య, రిశాలి, సుష్మిత, ఈశ్వరిలు ప్రదర్శించిన అంశాలు ఆద్యంతం భక్తిభావంతో ముంచెత్తాయి. గోవర్ధనగిరి ధారా, దశావతార శబ్దం, జణుత శబ్దం, నమో నమో రఘుకుల నాయక, శివుడు తాండవమాడెను అంశాలు ప్రదర్శించి భక్తిభావంలో ముంచెత్తారు. అనంతరం కూచిపూడి కళాక్షేత్రం (విశాఖ), హరిరామమూర్తి శిష్యురాలు మంజూష వినాయక కీర్తన, అన్నమాచర్య కీర్తనలోని అంశాలు ఆకట్టుకున్నాయి. బాలాత్రిపుర సుందరి నృత్య నికేతన్ (మచిలీపట్నం), యేలేశ్వరపు పూర్ణ చంద్రరావు శిష్యులు జాహ్నవి, రాఘవ, నంద సాకేత, సాయి పూర్ణ, కౌస్తుబ మణి, దేవి ప్రియ, జశ్మితలు శృంగార లహరి, జతి స్వరం హావభావాలు మెప్పించాయి. అనంతరం కళాకారులను వేదాంతం రాధే శ్యామ్, చింతా రవిబాలకృష్ణ, కావూరి భానుమూర్తి, వై.ఫణికుమార్, రామలింగేశ్వరస్వామివారి దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు మెమోంటోలు అందించి ఘనంగా సత్కరించారు.



ఒలింపియాడ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

## అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో డాక్టర్ కేకేఆర్స్ విద్యార్థుల ప్రతిభ

**గుడివాడ, మార్చి 21 :** అత్యంత ప్రతిష్టాత్మక సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11వ తేదీన అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో స్థానిక డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి ర్యాంకులను సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారామ్ తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వి.హేమ సాయిసిద్ధార్థ(8వ తరగతి) రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు, వి.యోజిత్‌రెడ్డి (6వ తరగతి) 3వ ర్యాంకు, డి.తేజత్‌నాయుడు (7వ తరగతి) 4వ ర్యాంకు, బి.కీర్తన్‌రెడ్డి (8వ తరగతి) 9వ ర్యాంకు, వైవీ కార్తీక్ (6వ తరగతి) 10వ ర్యాంకు, ఎస్.కె సాజిత్‌రెహాన్ (8వ తరగతి) 11వ ర్యాంకు, ఇ.వైష్ణవ్‌రెడ్డి (7వ తరగతి) 12వ ర్యాంకులు సాధించారని తెలిపారు. మొదటి 100ర్యాంకుల్లో 48మంది తమ విద్యార్థులు ఉండటం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, జ్యోతి, జబీనాలు అభినందించారు.



డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లలు, తల్లిదండులతో ఆసుపత్రి వైద్య బృందం

## ఆంధ్రా ఆసుపత్రిలో వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే

**భవానీపురం, మార్చి 21 :** వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా ఆంధ్రా ఆసుపత్రిలో డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లల సంరక్షణపై తల్లిదండ్రులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రా హాస్పిటల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్(కృష్ణా జిల్లా శాఖ) ఏపీ స్టేట్, న్యూరో డెవలప్‌మెంట్ పీడియాట్రిక్స్ ఐఏపీ చాప్టర్తో కలిసి పిల్లల సంరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల సంరక్షణ ప్రాముఖ్యతపై పీడియాట్రిక్స్ డాక్టర్ పీవీ రామారావు, డాక్టర్ ఆశ్రితలు మాట్లాడుతూ, డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లలు సమాజంలో కలిసి జీవించడానికి తగిన చర్యలపై వివరించారు. ఇంటి వద్ద చేయదగ్గ వ్యాయామాలు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, పిల్లల మానసిక ప్రవర్తన ఎలా గమనించాలి అనే అంశాలను విశదీకరించారు. మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ మీనా, పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ సాయిదీపక్, సైకాలజిస్ట్ గాయత్రి, స్పీచ్ థెరపిస్ట్ ప్రమోద, లక్ష్మి, డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పేరుకే పేదవానికి సీటు!

- మైలవరంలో పెత్తనం అంతా సొంత సామాజిక వర్గానిదే
- నెల తిరగక ముందే పరిశీలకుని మార్పు.. స్థానికుల విమర్శ

**మైలవరం, మార్చి 21:** ఈసారి ఎన్నికలు పేదవానికి పెత్తందారులకు అని ప్రగల్భాలు పలికే సీఎం జగన్మోహన్ రెడ్డి.. పేరుకే పేదవారికి సీటు ఇచ్చి వారిపై పెత్తనానికి తన సామాజిక వర్గానికి చెందిన వారిని పెట్టడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం సీటును సాధారణ వ్యక్తి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సర్నాల తిరుపతిరావుకు కేటాయించినా.. ఆయనపై పెత్తనానికి అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డిని పరిశీలకునిగా పెట్టారు.. అయితే ఇటీవల మైలవరంలో పార్టీ కార్యాలయ ప్రారంభం సందర్భంగా వైసీపీ శ్రేణుల భారీ ర్యాలీ, భోజనాల ఖర్చు, వలంటీర్లకు తాయిలాల ఖర్చు లెక్కల్లో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఫిర్యాదుతో అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డిని తప్పించి నెల్లూరు జిల్లాకు చెందిన కర్రా హర్షా రెడ్డిని పరిశీలకునిగా పెట్టారు. పరిశీలకుడి మార్పు ఇపుడు మైలవరంలో హాట్ టాపిక్ అయ్యింది. పేరుకే పేదవానికి సీటు అని చెప్పుకుంటూ.. నిర్ణయాలు తీసుకునే అధికారం అభ్యర్థికి ఇవ్వడంలేదని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. నా బీసీ.. నా ఎస్సీ.. నా ఎస్టీ.. వెనుక నడిపించే రెడ్డి అనే అదృశ్య హస్తాలు ఉన్నాయని మైలవరం అభ్యర్థి విషయంలో తేటతెల్లమవుతోంది. అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, అభ్యర్థి కోరిక మేరకే అదనపు పరిశీలకునిగా కర్రా హర్షారెడ్డిని అధిష్టానం నియమించిదని చెప్పారు.

## అవినీతి సొమ్మును రప్పిస్తాం : దేవినేని ఉమా



**గొల్లపూడి, మార్చి 21 :** టీడీపీ అధికారంలోకి రాగానే జగన్ ఐదేళ్లలో ల్యాండ్, శాండ్, వైన్, మైన్ సెంటు పట్టాల్లో అడ్డగోలుగా చేసిన రూ.8 లక్షల కోట్ల దోపిడీ సొమ్మును ప్రభుత్వ ఖజానాకు తిరిగి రప్పిస్తామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని జగన్ అడ్డగోలుగా దోచుకుని 38 క్రిమినల్ కేసుల్లో ఉన్న విషయాన్ని టీడీపీ ఆధారాలతో సహా బయటపెట్టిందన్నారు. ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చి ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి పాలన చేతకాక టీడీపీపై మహాదోపిడీ అని పుస్తకాలు వేశారంటే ప్రభుత్వానికి బుద్ధి ఉందా అని ప్రశ్నించారు. టీడీపీపై ఒక్క ఆరోపణ నిరూపించలేక మళ్లీ సిగ్గు లేకుండా పుస్తకాలు వేస్తున్నారంటే మీ మానసిక స్థితి ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. జరగబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలోకి విసిరేసి 161 అడుగుల గోతిలో ప్రజలు కప్పెడతారన్నారు.

# ఓటరూ.. మేలుకో



- కర్తవ్య నిర్వహణలో పాలుపంచుకోండి
- సీ విజిల్, ఓటర్ హెల్ప్‌లైన్, కేవైసీ, సాక్ష్యం యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోండి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం.. అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడిన వాళ్లం అవుతాం. కొత్తగా ఓటు హక్కు సాధించిన నవ ఓటర్లతో పాటు, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఓటు హక్కు విషయంలో అత్యంత బాధ్యతాయుతంగా ఉండాలి. ఓటరు స్పృహతో కర్తవ్యాలను నిర్వర్తించాలి. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించటంలో భాగంగా ఎన్నికల సంఘం పలు మొబైల్ యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. వాటిలో ముఖ్యమైన నాలుగు యాప్‌ల గురించి తెలుసుకుందాం. ఈ యాప్‌లను ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

### సీ విజిల్




ఈ యాప్ ఒక రకంగా ఓటర్ల గ్రీవెన్స్, ఫిర్యాదులు స్వీకరిస్తుంది. ప్రస్తుతం అమల్లోకి వచ్చిన మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ మొదలుకొని ఎన్నికలు, ఫలితాలు ప్రకటించే వరకు ఎలాంటి ఫిర్యాదులనైనా ఎన్నికల సంఘం దృష్టికి ఓటర్లు నేరుగా ఈ యాప్ ద్వారా తీసుకు రావచ్చు. ఎక్కడైతే అక్రమాలు జరిగాయో.. జీపీఎస్ లొకేషన్‌ను ఈ యాప్ ద్వారా పంపించవచ్చు. ఒక్కోసారి ప్రత్యక్షంగా కళ్లెదుట జరిగే సంఘటనలు కూడా ఎన్నికల సంఘం దృష్టికి ఈ యాప్ ద్వారా తీసుకువెళ్లవచ్చు. మీ వివరాలు అత్యంత రహస్యంగా ఉంటాయి. మీ ఫిర్యాదు ఏ స్థితిలో ఉందో కూడా ట్రాక్ చేసి తెలుసుకోవచ్చు.

### ఓటర్ హెల్ప్ లైన్




ఈ యాప్ ద్వారా ఓటర్ల జాబితాలో మీ పేరు ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు. ఓటరు రిజిస్ట్రేషన్‌ను మార్చుకోవచ్చు. ఎన్నికల సంబంధిత సమాచారాన్ని ఈ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. అలాగే ఫిర్యాదులను కూడా యాప్ ద్వారా చేయవచ్చు.

### సాక్షం

ఈ మొబైల్ యాప్ ద్వారా దివ్యాంగులు సహాయాన్ని పొందవచ్చు. ఓటు హక్కు వినియోగించుకోవటానికి ముందుగానే ఈ యాప్ ద్వారా మీకు ఎలాంటి సహాయం కావాలో కోరవచ్చు. మాటలు వినలేని వారు తమను సంభాషించగలిగే వారి సహాయాన్ని కోరవచ్చు. చూపు తక్కువ కలిగిన వారు కూడా బ్యాలెట్ పేపర్‌ను చక్కగా చూడలిగే విధంగా ఫాంట్లు పెద్దవి చయటం, కోరిన మీదట రంగులు హైలెట్ చేయటం వంటివి చేస్తారు. పోలింగ్ కేంద్రాల సమాచారం గురించి తెలుసుకోవచ్చు. వీల్‌చెయిర్ సహాయాన్ని కూడా పొందవచ్చు. ఏదైనా ఫిర్యాదులు ఉన్నా చేయవచ్చు.




### కేవైసీ




ఈ మొబైల్ అప్లికేషన్ ద్వారా ఎన్నికలలో పాల్గొనే అభ్యర్థుల పేర్లను, అభ్యర్థుల క్రిమినల్ కేసులు గురించి తెలుసుకోవచ్చు. అలాగే అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల గురించి, అందులోని సమాచారం తెలుసుకోవచ్చు.

## ఎన్టీఆర్ జిల్లాలో విస్తృత తనిఖీలు

- ఎంసీసీ, ఎన్నికల ఫిర్యాదులకు కంట్రోల్ రూం ఏర్పాటు : కలెక్టర్ దిల్లీరావు

**వన్‌టౌన్, మార్చి 21 :** ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులతో కలిసి నగరంలో ఎన్నికల మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ తూర్పు నియోజకవర్గ రిసెప్షన్ సెంటర్‌కు సంబంధించి ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్, పశ్చిమ నియోజకవర్గం రిసెప్షన్ సెంటర్‌కు సంబంధించి వన్‌టౌన్‌లోని గాంధీ మహిళా కళాశాలను తనిఖీ చేశారు. పోలింగ్ ముందు, తరువాత మూడు దశలకు అవసరమైన ఏర్పాట్లను ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులో ఉన్నందున ఫిర్యాదులను సత్వరం పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎంసీసీ, ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను కంట్రోల్ రూం నెంబర్ 0866-2570051కు ఫోన్‌చేసి తెలియజేయాలని సూచించారు.



గాంధీజీ మహిళా కళాశాలలో కలెక్టర్ తనిఖీలు



తోట్లవల్లూరులో లే అవుట్, పనులు అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులు

## తోట్లవల్లూరులో అక్రమ వెంచర్!

- 11 ఎకరాల వ్యవసాయ భూమిలో ట్రాక్టర్‌తో పనులు
- సీఆర్‌డీఏ లే అవుట్ పేరుతో బోర్డు ఏర్పాటు
- అనుమతులు లేవని అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

**తోట్లవల్లూరు, మార్చి 21 :** తోట్లవల్లూరు కనకదుర్గమ్మకాలనీ వద్ద అక్రమ లే అవుట్ పనులను గురువారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. 11 ఎకరాల వ్యవసాయ భూమిలో శ్రీకర ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పేరుతో లే అవుట్ కోసం ట్రాక్టర్‌తో చేపట్టిన పనులను తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, ఇన్‌చార్జి ఆర్ఐ రామ్మోహన్‌రావు, వీఆర్వో డి.నాగేశ్వరరావు మధ్యాహ్నం నిలిపివేశారు. వ్యవసాయేతర భూమి కోసం దరఖాస్తు చేయకుండా వెంచర్ పనులు చేయటానికి వీల్లేదని చెప్పారు. అధికారులు వెళ్లిన తరువాత తిరిగి పనులు మొదలు పెటడంతో ఇన్‌చార్జి ఆర్ఐ రామ్మోహన్‌రావు, విఆర్వో డి.నాగేశ్వరరావు పనులు ఆపమనటంతో అక్కడి సిబ్బంది ఎదురుతిరిగారు. రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారం లేదని, సీఆర్‌డీఏ నుంచి అనుమతి తెచ్చుకుంటామని ముందు బయటకు వెళ్లండని ఆర్ఐ, విఆర్వోని సిబ్బంది బెదిరించారు. దీంతో వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు దరఖాస్తు చేసుకోవాల్సిందేనని, పనులు వెంటనే ఆపకపోతే కేసు పెట్టాల్సి ఉంటుందని చెప్పటంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. అనుమతి లేకుండా పనులు చేపట్టడంపై వారికి వైసీపీ ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## యథేచ్ఛగా ఇసుక దోపిడీ!

- ఫిర్యాదులు చేసినా పట్టని అధికారులు
- లంకపల్లి క్వారీ వద్ద టీడీపీ ధర్నా

**లంకపల్లి(పమిడిముక్కల), మార్చి 21 :** పమిడిముక్కల మండల లంకపల్లిలో యదేచ్ఛగా వందలాది టిప్పర్లతో ఇసుక దోపిడీ జరుగుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్లకుమార్ రాజా ఆరోపించారు. లంకపల్లిలో ఇసుక క్వారీ వద్ద పార్టీ నాయకులు, గ్రామస్థులతో కలిసి గురువారం ధర్నాచేసి ఇసుకదోపిడీ అరికట్టాలని నిరసన తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా వందలాది టిప్పర్లతో రాత్రి పగలు ఇసుక దోచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మైనింగ్ అధికారులు పరిశీలనకు వెళ్లినా ఆపడంలేదని తహసీల్దార్ చెబుతున్నారని, క్వారీలు నిర్వహణ తమదికాదని రిటర్నింగ్ అధికారి అంటున్నారని ఇసుక దోపిడీ నిలువరించడంలో అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎట్టకేలకు ఇసుక అక్రమతవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్థులకు ఏమైనా జరిగితే దానికి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పార్టీ సీనియర్ నాయకులు జక్కా శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, ఐనపూరు గ్రామస్థులు పాల్గొన్నారు.



లంకపల్లిలో ఇసుక క్వారీ వద్ద టీడీపీ నాయకుల ధర్నా



ఐక్యవేదిక సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న షర్మిల, ఇతర నేతలు

## బీజేపీ పాలనలో దిగజారుతున్న విలువలు

- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

**గవర్నర్‌పేట, మార్చి 21:** దేశానికి బీజేపీ పాలన మంచిది కాదని, ఈ పాలనతో విలువలు దిగజారుతున్నాయని ఏపీసీసీ చీఫ్ షర్మిల అన్నారు. ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో గురువారం ఇండియా భాగస్వామ్య పక్షాలు, సారూప్య రాజకీయ, రైతు, కార్మిక, మహిళా, ప్రజా సంఘాల ఐక్యవేదిక సమావేశం జరిగింది. రైతు సంఘం నేతలు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షత వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జై భారత్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ, ప్రత్యేకహోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ బీజేపీ మెప్పు కోసం జగన్ పనిచేస్తున్నారని, ఆ పార్టీ చేస్తున్న మోసానికి బాబు, జగన్ ఇద్దరు మౌనం వహిస్తున్నారన్నారు.

## వైసీపీ నుంచి వలసల జోరు

- యార్లగడ్డ సమక్షంలో టీడీపీలోకి చేరికలు

**గుణదల, మార్చి 21 :** గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు అధిక సంఖ్యలో గన్నవరం నియోజకవర్గం టిడిపి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో టీడీపీలో చేరారు. ఎనికేపాడులోని పార్టీ కార్యాలయంలో యార్లగడ్డ ఆధ్వర్యంలో మాల మహానాడు ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు వీరబత్తిన అమల్ దాస్ ఆధ్వర్యంలో 400మంది టీడీపీ కండువాలు కప్పుకున్నారు. దీంతో గన్నవరంలో టీడీపీ మరింత బలోపేతం అవుతుందని వెంకట్రావు అన్నారు.



ఎనికేపాడులో వైసీపీ నేతలకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

### యార్లగడ్డ గెలుపే లక్ష్యం కావాలి

- కొనకళ్ల నారాయణ

**గన్నవరం :** ప్రముఖ న్యాయవాది కేవీ రమణను టీడీపీ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు తదితర నాయకులు రమణ నివాసానికి వెళ్లి కొద్ది సేపు ఆయనతో ముచ్చటించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి సపోర్టు చేయాలని కోరారు. యార్లగడ్డ వెంకట్రావు గెలుపే లక్ష్యం కావాలని కొనకళ్ల నారాయణ పిలుపునిచ్చారు. అనంతరం దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు, బీబీగూడెం పీఏసీఎస్ చైర్ పర్సన్ బోయపాటి మురళీకృష్ణ(బుల్లియ్య) ఎంపీటీసీ సభ్యుడు శాంతి కిషోర్, గూడపాటి తులసీమోహన్, ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, కెహెచ్ కోటేశ్వరరావు, పరుచూరి నరేష్ పాల్గొన్నారు. అనంతరం బీజేపీ కార్యాలయానికి వెళ్లి చిగురుపాటి కుమారస్వామి, నాదెండ్ల మోహన్‌ను కలిశారు. మూడు పార్టీల నాయకులు భేషజాలకు పోకుండా కలిసికట్టుగా పని చేసి యార్లగడ్డ వెంకట్రావును భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కొనకళ్ల నారాయణ తెలిపారు.

## అనుమతుల కోసం సువిధ పోర్టల్ యాప్

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

**వన్‌టౌన్, మార్చి 21 :** రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అవసరమయ్యే వాహనాలు, ఇతర అనుమతుల మంజూరుకు సువిధ పోర్టల్ యాప్ ద్వారా లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం వారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాహనాల అనుమతికి సంబంధించి దరఖాస్తుతో పాటు వాహన రిజిస్ట్రేషన్ వివరాలను, డ్రైవింగ్ లైసెన్స్, వాహన యాజమాని పేరు, డ్రైవర్ పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ తదితర వివరాలు జతచేయాలని తెలిపారు. వాహనం సంచరించే ప్రదేశాల వివరాలు, రూట్ మ్యాప్ తెలియజేయాలి. వాహన తనిఖీ అధికారి( మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్) నుంచి వాహనాన్ని తనిఖీ చేయించుకుని సర్టిఫికేట్ తీసుకోవాలి. తాత్కాలిక ఎన్నికల కార్యాలయం ఏర్పాటుకు భవన యాజమాని అనుమతి, లేదా అద్దె వివరాలు ఇతర అంచనాల వ్యయం, తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. ర్యాలీలు, రోడ్డు షోలు, ఇతర కార్యక్రమాల అనుమతికి ప్రదేశం, రూట్ మ్యాప్ ర్యాలీలో పాల్గొనే వారి సంఖ్య, తేదీ, సమయం ఇతర వివరాలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి తెలియజేసి అనుమతి తీసుకోవాలి. బహిరంగ సభ నిర్వహణ సమయంలో వీఐపీ, వీవీఐపీల సందర్శన సమయంలో హెలీప్యాడ్ అనుమతి కోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుమతి కోసం ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. అనుమతులకు కనీసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించినా.. వాహనాలను ఎన్నికల ప్రచారానికి వినియోగించినా ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించినట్టు పరిగణించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ దిల్లీరావు పేర్కొన్నారు.

## దుర్గగుడి సరుకుల శాంపిళ్ల సేకరణ

- ల్యాబ్‌కు పంపి నివేదిక కోరిన అధికారులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

**వన్‌టౌన్, మార్చి 21 :** దుర్గగుడికి కాంట్రాక్టర్లు సప్లయ్ చేసిన సరుకుల శాంపిళ్లను బుధవారం రాత్రి, గురువారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు సేకరించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'దుర్గగుడికి నాణ్యత లోపం సరుకులు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు' కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్స్‌పెక్టర్ రమేష్ సిబ్బందితో వెళ్లి ప్రధాన స్టోర్, దిగువన ఉన్న స్టోర్లలో సరుకుల శాంపిళ్లు సేకరించారు. వీటిని లేబరేటరీలకు పంపి వచ్చిన నివేదిక ఆధారంగా వాటి నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణలో వచ్చిన సారాంశాన్ని బట్టి సరుకులను అంగీకరించే అవకాశముంది.



యనమలకుదురులో రహదారిపక్కన సిద్ధం ఫ్లెక్సీ


## ఫ్లెక్సీల తొలగింపులో అధికారుల ఉదాసీనత!

**పెనమలూరు, మార్చి 21 :** ఎన్నికల నియమావళిలో భాగంగా రాజకీయ ఫ్లెక్సీలపై సీవిజిల్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామంటూ.. సదరు ఫిర్యాదులపై అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. యనమలకుదురు పెట్రోలు బంకు సమీపంలో ఓ షాపు పైభాగంలో 'సిద్ధం' పేరుతో స్థానిక వైసీపీ నేత ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై స్థానిక విద్యార్థి గురువారం సీవిజిల్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే ఫిర్యాదుపై అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

## ఉగాది పురస్కారాలకు జిల్లా పోలీసుల ఎంపిక

**మచిలీపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) :** కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారులకు ప్రభుత్వం ఉగాది-2024 పురస్కారాలను గురువారం ప్రకటించింది. విధుల్లో ఉత్తమసేవలు అందించినందుకుగాను ఉగాది పురస్కారాలను ఎంపికచేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీచేశారు. ఉగాది సేవాపతకానికి ఎంపికైన వారిలో మచిలీపట్నం డీఎస్‌బీలో సర్కిల్ ఇనస్పెక్టర్‌గా పనిచేస్తున్న జేవీ రమణ, ఏఎస్ఐ అబ్దుల్ సలాం ఉన్నారు. బందరు తాలూకా పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐగా పనిచేస్తున్న బి.రమేష్‌బాబు, మచిలీపట్నం ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్న బి.సాల్మన్‌రాజు ఎంపికయ్యారు. మచిలీపట్నం పోలీస్ ట్రైనింగ్ సెంటర్(డీటీసీ)లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఏడీవీఆర్ శర్మ, గతంలో మచిలీపట్నంలో పనిచేసి ప్రస్తుతం ఏలూరు రేంజ్ కంట్రోల్ రూమ్‌లో ఎస్ఐగా ఉన్న ఎండీ రిజ్వాన్ కూడా సేవాపతకానికి ఎంపికయ్యారు.

## అనుమానంతో పట్టుకుని.. ఆధారాలు చూసి వదిలారు



**విజయవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) :** కారులో ముగ్గురు వ్యక్తులు తీసుకెళ్తున్న రూ.12లక్షలను ఎన్నికల స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. తర్వాత ఆధారాలను పరిశీలించి వదిలిపెట్టారు. ఈ ఘటన సెంట్రల్ నియోజకవర్గం భానునగర్‌లో గురువారం జరిగింది. విజయవాడలోని బంధన్ బ్యాంక్ నుంచి సిబ్బంది రూ.12లక్షలను కారులో పామర్రు బ్రాంచ్‌కు తీసుకెళ్తున్నారు. ఇందులో ఇద్దరు వ్యక్తులకు ఒక్కోవ్యక్తికి రూ.3లక్షల చొప్పున బ్యాంకు అధికారులు ఆథరైజేషన్ లేఖ ఇచ్చారు. భానునగర్‌లో అధికారులు పరిశీలించగా లేఖ ప్రకారం రూ.6లక్షలు ఉండాలి. అదనంగా రూ.6లక్షలు ఉండడంతో అధికారులకు అనుమానం వచ్చింది. నగదును సీజ్‌చేసి ఆదాయపు పన్ను అధికారులను సంప్రదించారు. బ్యాంకు అధికారులను సంప్రదించి వివరణ తీసుకోవాలని, అసలు విషయాన్ని నిర్ధారించుకోవాలని సూచించారు. బ్యాంకుకు వెళ్లి అధికారులను ఆరా తీయగా రూ.12లక్షలు ఇచ్చినట్టు వెల్లడించారు. పామర్రు బ్రాంచ్‌లో రుణం కోసం ఈ నగదును పంపుతున్నట్టు తెలిపారు. దీనితో స్క్వాడ్ అధికారులు నగదును వారికి అప్పగించారు.

## వైభవంగా బూసిమ్మ తిరునాళ్ల ప్రారంభం

**ఉయ్యూరు, మార్చి 21:** ముదునూరులో కురాకుల వంశస్థుల ఆధ్వర్యంలో బూసిమ్మ తిరునాళ్లు వైభవంగా ప్రారంభమయ్యాయి. పదిహేను రోజులపాటు తిరునాళ్ల నిర్వహిస్తారు. బుధవారం రాత్రి మెట్టినింటి నుంచి అమ్మవారు బయల్దేరి ఊరంతా ఊరేగి భక్తుల దీపారాధనలు, హారతులు అందుకున్నారు. గురువారం అప్పికట్ల రోడ్డులోని ఆలయానికి చేరుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉయ్యూరు రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.



ముదునూరులో బూసిమ్మ గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

## వ్యభిచార గృహంపై దాడి

**ఉయ్యూరు, మార్చి 21:** స్థానిక విశ్వనాథం బజారులో గురువారం వ్యభిచార గృహంపై పోలీసులు దాడిచేసి ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. సీఐ హబీబ్‌బాషా తెలిపిన వివరాల ప్రకారం..విశ్వనాథం బజారులో ఓ డాబాపైన గృహంలో వ్యభిచారం నడుస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్సై గణేశ్‌కుమార్, సిబ్బందితో కలిసి దాడిచేశారు. ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. తోట్లవల్లూరు మండలం గరికపర్రు, విజయవాడ కృష్ణలంక, నూజివీడుకు చెందిన వారిగా మహిళలను గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. తెలిసిన వారికి వాట్సప్‌లో ఫోటోలు పంపి ఆకర్షించి వ్యభిచార గృహం నడుపుతున్నట్టు దర్యాప్తులో తేలిందన్నారు.

## కారు డ్రైవర్‌కు ఏడాది జైలు

**గన్నవరం, మార్చి 21:** కారును అతివేగంగా నడిపి ఎడమవైపునకు పల్టీలు కొట్టించి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు గురువారం గన్నవరం కోర్టు ఏడాది జైలు, రూ.500 జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ చుట్టుగుంట ప్రాంతానికి చెందిన గార్లపాటి భారతి ఆమె కుటుంబసభ్యులతో కలిసి 2019 ఏప్రిల్ 29వ తేదీన శ్రీకాకుళం జిల్లా అరసవెల్లి దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకుని తిరిగి 30న బయలుదేరారు. ఏలూరు దగ్గరకు రాగానే డ్రైవర్‌కు నిద్ర వస్తోందని చెప్పడంతో పక్కనే కారు ఆపి టీతాగి మళ్లీ బయలు దేరారు. కేసరపల్లి బుడమేరు వంతెన దగ్గరకు వచ్చేసరికి డ్రైవర్ చిరంజీవి అతివేగంగా, నిర్లక్ష్యంగా కారు నడుపుతూ ఎడమవైపునకు పోనిచ్చాడు. దీంతో కారు మూడు పల్టీలు కొట్టింది. ముందు సీట్లో ఉన్న భారతి భర్త నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు గన్నవరం 12వ అదనపు మెజిస్ట్రేట్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్ష్యాలను విచారించిన న్యాయస్థానం డ్రైవర్‌పై నేరం రుజువు కావటంతో ఏడాది జైలు రూ.500 జరిమానా విధించింది.

## డయల్ యువర్ డీఎం నేడు

**గన్నవరం, మార్చి 21:** స్థానిక ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహిస్తామని డిపో మేనేజర్ పి.శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు, ప్రయాణికులు 87909-96090కు ఫోన్‌చేసి సమస్యలు తెలియజేయాలని, సలహాలు సూచనలు ఇవ్వాలని డీఎం పి.శివాజీ సూచించారు.











కాకులపాడులో గడపగడపకూ శంఖారావం కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, ఉయ్యూరు 7వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న దేవినేని గౌతమ్, స్మిత, గన్నవరంలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

# కూటమి విజయమే లక్ష్యం

**'గడప గడపకూ శంఖారావం'లో టీడీపీ నాయకులు**

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 21:** టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి విజయాన్ని చేకూర్చడమే లక్ష్యంగా కార్యకర్తలంతా పని చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జి చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. టీడీపీ కాకులపాడు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గడపగడపకు శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారపార్టీ అరాచకపాలన చేస్తోందని ప్రజలకు వివరించారు. బీసీ డిక్లరేషన్, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడంకి స్వామిదాసు, వెంకయ్య, హరిబాబు, ముప్పాళ్ల శంకరరావు, పర్వతనేని కృష్ణారావు, అంకినీడు, నత్తా రాజ్‌కుమార్, కనకం, కాలి రమేష్, చింతాలు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతో అన్నివర్గాలకూ మేలు

**ఉయ్యూరు:** టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ నాయకులు దేవినేని గౌతమ్, స్మిత అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉయ్యూరు 7వ వార్డులో వారు పర్యటించారు. బీసీ డిక్లరేషన్, సంక్షేమ పథకాలను వివరించి కూటమికి ఓట్లువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సమర్థ పాలకుడు చంద్రబాబు

**● మల్లవల్లి పారిశ్రామికవాడకు పూర్వవైభవం ఆయనతోనే సాధ్యం: టీడీపీ పట్టణాధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు**

**హనుమాన్‌జంక్షన్:** "వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడింది. రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టే సత్తా చంద్రబాబుకే ఉంది. మల్లవల్లి పారిశ్రామికవాడకు మళ్లీ పూర్వవైభవం తేగల సమర్థుడు ఆయన. రానున్న ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమికి మద్దతుగా నిలవాలి." అని ప్రజలను టీడీపీ హనుమాన్‌జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు కోరారు. గురువారం శంఖారావం కార్యక్రమంలో భాగంగా బాపులపాడు సాయిబాబా గుడి ప్రాంతంలో టీడీపీ-జనసేన మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. టీడీపీ కూటమి విజయం సాధించాలని గంగానమ్మ గుడి వద్ద పూజలు చేసి, ప్రచారం ప్రారంభించారు. పారిశ్రామికంగా గన్నవరం నియోజవర్గాన్ని అభివృద్ధి చేసే సత్తా యార్లగడ్డ వెంకట్రావుకు ఉందన్నారు. ఎన్నికల్లో యార్లగడ్డను భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. మూల్పూరి సాయికల్యాణి, వడ్డిల్లి లక్ష్మి, మొవ్వా వెంకటేశ్వరరావు, గార్లపాటి రాజేశ్వరరావు, బొమ్ములూరు సర్పంచ్ కాటూరి విజయ్‌భాస్కర్, తమిరి రమేష్, రాజులపాటి శ్రీనివాసరావు, పోతుమర్తి సత్యనారాయణ, కొల్లి బుజ్జి, యార్లగడ్డ సత్యనారాయణ, గుమ్మడి శేషగిరిరావు, చెరుకూరి హరికృష్ణ, కడవకొల్లు నాగరాజు, యలమంచిలి నాగమణి, పొట్లూరి ఫణి, తాడిశెట్టి శ్రీను, లంక శివ, కొల్లి శ్రీను పాల్గొన్నారు.



బాపులపాడు గంగానమ్మ గుడి వద్ద శంఖారావాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

## ఎన్నికల విధుల్లో అప్రమత్తత అవసరం

**● సెక్టార్ అధికారులతో ఈఆర్వో గీతాంజలి శర్మ**

**గన్నవరం, మార్చి 21:** ఎన్నికలు ముగిసే వరకూ అందరూ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఈఆర్వో), జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సెక్టార్ అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సెక్టార్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, అక్కడ లోటుపాట్లు ఉంటే వెంటనే చెప్పాలని ఆదేశించారు. రూట్లను చూసుకోవాలని సూచించారు. పోలింగ్ సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత సెక్టార్ అధికారులపై ఉందన్నారు. తహసీల్దార్ పవన్‌కుమార్, ఎన్నికల డీటీ గోపాల్‌రెడ్డి, ఆర్ఐ ఉదయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఆర్వో గీతాంజలి శర్మ

## అన్నదానం

**ఉయ్యూరు, మార్చి 21:** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తనయుడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో గురువారం పార్టీ కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్ ద్వారా భారీ అన్నదానం చేశారు. సమాజ సేవలో తెలుగుయువత ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని చౌదరి తెలిపారు.

## రైలు ఢీకొని మృతిచెందింది తేలప్రోలువాసే

**ఉంగుటూరు, మార్చి 21:** తేలప్రోలు రైల్వేస్టేషన్ గేటు సమీపంలో రైలు ఢీకొని మృతిచెందిన వ్యక్తి స్థానికుడేనని నిర్ధారించినట్లు ఏలూరు రైల్వే పోలీసులు తెలిపారు. తేలప్రోలు రైల్వేస్టేషన్ గేటు సమీపంలో పట్టాల పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని గురువారం ఉదయం వార్తా పత్రికల్లో చూసిన మృతుడి కుటుంబసభ్యులు ఏలూరు రైల్వే పోలీసులకు ఫోన్‌చేసి వివరాలు వెల్లడించారు. మృతుడు తేలప్రోలు గ్రామానికి చెందిన మంగదొడ్డి సుధాకర్(41)గా కుటుంబసభ్యుల సమక్షంలో గుర్తించారు. సుధాకర్ వ్యవసాయకూలి పనులు చేస్తుంటాడు. ఖాళీ సమయాల్లో సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. సెంట్రింగ్ పనుల్లో భాగంగా వారం నుంచి ఉదయం 6 గంటలకు గన్నవరం వెళ్లి తిరిగి రాత్రి 8గంటలకు ఇంటికి వచ్చేవాడు. మంగళవారం ఉదయం సెంట్రింగ్ పనికి గన్నవరం వెళ్లిన సుధాకర్ అదేరోజు రాత్రి 8గంటలకు తేలప్రోలు సెంటర్‌లో బస్సు దిగాడు. నేరుగా ఇంటికి వెళ్లకుండా రైల్వేగేటు అవతల తనకు ప్రభుత్వం ఇచ్చిన ప్లాటులోకి వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మృతిచెందాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ ఆధ్వర్యంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, మృతుని కుటుంబసభ్యులకు అప్పగించారు.



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ

## తానా సేవలు అభినందనీయం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 21:** గ్రామీణప్రాంతాల్లో ప్రజలకు, రైతులకు తానా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలు, రక్షణ కిట్ల పంపిణీ, అందిస్తున్న సేవలు అభినందనీయమని సాగునీటి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ పేర్కొన్నారు. రంగన్నగూడెంలో తానా కార్యదర్శి కసుకుర్తి రాజా ఆర్థిక సహకారంతో ఈనెల 10న కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి పరీక్షలు చేశారు. 80మందికి గురువారం కళ్లజోళ్లను ఉచితంగా అందించారు. ఉయ్యూరు రోటరీ కంటి ఆస్పత్రికి 14మందిని ఉచిత శస్త్రచికిత్స నిమిత్తం వాహనంలో పంపించామని ఆళ్ల తెలిపారు. సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, ఆళ్ల గురవయ్య, కసుకుర్తి నాగభూషణం, పుసులూరి గాంధీ పాల్గొన్నారు.

### ఇంటర్‌లో చేరడం ఇష్టం లేక

## హైదరాబాద్ వెళ్లిపోయిన బాలుడు

**పెనమలూరు, మార్చి 21:** తనను క్రికెట్ అకాడమీలో చేర్పిస్తే రాణిస్తానని మంకు పట్టు పట్టాడో జగ్గయ్యపేటకు చెందిన పదో తరగతి పూర్తైన విద్యార్థి. తల్లిదండ్రులేమో ఆటల పిచ్చిలో పడి చదువు పాడుచేసుకుంటాడని భయపడి వద్దన్నారు. బలవంతం మీద బుధవారం కానూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో చేరడానికి తల్లితో వచ్చాడు. తల్లి కళాశాలలో అడ్మిషన్‌పై మాట్లాడుతుండగా కనిపించకుండాపోయాడు. ఎంత వెదికినా కనిపించకపోవడంతో తల్లడిల్లిన తల్లి పోలీసులను ఆశ్రయించింది. పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. బాలుడు హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. అతడిని తల్లికి పెనమలూరు పోలీసులు అప్పగించారు.

## 24న కోడూరుపాడులో అయ్యప్ప జన్మదినోత్సవం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 21:** కోడూరుపాడులోని కోదండరామస్వామి ఆలయంలో తోట శివశంకర్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి జన్మదిన పూజోత్సవం ఈనెల 24వ తేదీన వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు, వైస్ ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు దంపతుల గురువారం తెలిపారు. తెల్లవారుజామున లక్ష్మీగణపతిహోమంతో ప్రత్యేక పూజ ప్రారంభమవుతుందన్నారు. స్వామికి అష్టద్రవ్యాభిషేకం, జలాభిషేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అన్నప్రసాద వితరణ ఉందన్నారు.



## పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం

**ఉంగుటూరు, మార్చి 21:** బలవర్థకమైన, మంచి పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ సీడీపీవో పి.వెంకటలక్ష్మి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా గురువారం వెల్దిపాడు జడ్పీ హైస్కూల్‌లో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీడీపీవో హాజరయ్యారు. మహిళలతోపాటు విద్యార్థుల్లో పోషకాహార లోపం లేకుండా చేసేందుకు ప్రభుత్వం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. పోషకాహారం లోపంతో తలెత్తే ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కిశోర బాలికలు రోజూ బలవర్థకమైన ఆహారాన్ని తీసుకుంటే రక్తహీనత సమస్య ఉండదన్నారు. హెచ్ఎం జేకే దుర్గాప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా షిరిడిసాయి మందిర వార్షికోత్సవం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 21:** వీరవల్లిలోని షిరిడి సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తుల సమక్షంలో గణపతి పూజ, బాబాకు సహస్ర పుష్పార్చన, అభిషేకం, పూజలు నిర్వహించారు. కూనపరాజుపర్వకు చెందిన అంజనేయ భజన సమాజం ఆధ్వర్యంలో షిరిడిసాయి గానామృతం నిర్వహించారు. 3వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు కోడెబోయిన బాబీ, రావి ఈశ్వర్, లంక బేబీసరోజిని, పద్మశ్రీ, మాచినేని బాలకృష్ణ, తవ్వా ఆదిలక్ష్మి, సాయిచంద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### 4న వేణుగోపాలస్వామి,

## పంచ పట్టాభిరామస్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠ

**ఉయ్యూరు, మార్చి 21:** వేణుగోపాలస్వామి, పంచ పట్టాభిరామస్వామి దేవస్థానాల్లో ఏప్రిల్ 4న విగ్రహాల పునఃప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. నూతనంగా నిర్మించిన స్వామివార్ల ఆలయాల్లో విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమ బ్రోచర్‌ను గురువారం ధర్మకర్తల మండలి సభ్యులతో కలసి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ లోయ చింతయ్య ఆవిష్కరించారు. ఆలయ ఉద్యోగి మురళి పాల్గొన్నారు.

## షిరిడి సాయిబాబాకు గ్రామోత్సవం

**హనుమాన్‌జంక్షన్, మార్చి 21:** ఐటీఐ రోడ్డులోని షిరిడి సాయిబాబా మందిరంలో బాబాకు గురువారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక రాజులకాలనీకి చెందిన రామకృష్ణం రాజు 500 మందికి భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం నగర సంకీర్తనతో బాబాకు గ్రామోత్సవం జరిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొల్లి వెంకట రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఎనికేపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న యార్లగడ్డ జ్ఞానేశ్వరి

### సూపర్ సిక్స్ పథకాలతో

## మహిళల జీవితాల్లో వెలుగులు

**● యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి**

**గుణదల, మార్చి 21:** టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలతో మహిళల జీవితాలు వెలుగుమయం కానున్నాయని కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి యార్లగడ్డ జ్ఞానేశ్వరి అన్నారు. ఆమె గురువారం ఎనికేపాడులో ఇంటింటికీ వెళ్లి కూటమి అధికారంలోకి వచ్చాక అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళలపై దాడులకు పాల్పడే వారికి గన్నవరంలో స్థానమే లేదని అన్నారు. కోనేరు శివరామకృష్ణ(పెదబాబు), కోనేరు వెంకటనారాయణ, కోనేరు సందీప్, చాగంటిపాటి వెంకటకృష్ణ, వేలంకి శరత్ కుమార్, గోగం బాలకోటేశ్వరరావు, పొదిలి లలిత, అనుమోలు విజయ, వరికూటి కోటేశ్వరరావు, ముప్పా విజయలక్ష్మి, బీజేపీ విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు కురుమద్దాలి ఫణికుమార్, జనసేన నేత పొదిలి దుర్గారావు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షం

**గన్నవరం, మార్చి 21:** చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ అన్నారు. గన్నవరంలో గురు వారం గడపగడపకూ శంఖారావం కార్యక్రమాన్ని టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా, యార్లగడ్డ వెంకట్రావును ఎమ్మెల్యేగా గెలిపిస్తే కొత్త పరిశ్రమలు వస్తాయని యువతకు ఉపాధి దొరుకుతుందని సుధీర్ ప్రజలకు వివరించారు. పాలడుగు నాని, పడమట రంగారావు, జాస్తి ఫణిశేఖర్, గూడవల్లి నాగేశ్వరరావు, లావు గణేష్, కాట్రగడ్డ అరుణకుమారి, పోలగాని సుబ్రహ్మణ్యేశ్వరరావు, నూతలపాటి విజయబాబు, పి.శ్రీనివాసరావు, రవిబాబు, కృష్ణా, గోపాలరావు, మనోజ్ పాల్గొన్నారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 114, 123, 134 |
| చికెన్ విత్ స్కిన్ | 214 |
| చికెన్ స్కిన్‌లెస్ | 224 |

**నెక్ కోడిగుడ్డు ధర**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.23

## నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి : డీఎస్పీ




మచిలీపట్నం టౌన్ : ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని డీఎస్పీ అబ్దుల్ సుభాన్ సూచించారు. నగరంలో భద్రతా దళాల కవాతును గురువారం ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి భయం లేకుండా, స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేందుకే భద్రతా బలగాలు కవాతు నిర్వహిస్తున్నాయన్నారు. సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# అనుమతులు తీసుకోకుంటే కోడ్ ఉల్లంఘనే



మచిలీపట్నం టౌన్, మార్చి 21 : ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని వివిధ పార్టీల నాయకులు ప్రచారానికి, వాహనాలకు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని బందరు ఆర్డీవో, మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.వాణి పేర్కొన్నారు. తన చాంబర్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు జెండాలతో, వాహనాలతో ప్రచారం చేస్తున్నారన్నారు. అనుమతులు లేకుండా ఎలాంటి ప్రచారం చేసినా కోడ్ ఉల్లంఘించినట్లేనన్నారు. ఇళ్లపై బ్యానర్లు కట్టేటప్పుడు యజమానుల అనుమతులు తీసుకోవాలన్నారు. ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించేందుకు ముం దస్తు అనుమతులు తీసుకోవాలన్నారు.

నగర పాలక సంస్థ కమిషనరు ఎప్పటికప్పుడు బ్యానర్లను తొలగిస్తున్నారని, అయితే మళ్లీ అదే స్థలాల్లో బ్యానర్లు , జెండాలు పెడుతున్నారన్నారు. అధికారులు తొలగించిన చోట్ల మళ్లీ బ్యానర్లు పెడితే ఖర్చు ఆయా పార్టీల ఖాతాలో నమోదు చేస్తామన్నారు. బహిరంగ సభల్లో ఇతర పార్టీలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడరాదన్నారు. రాజకీయ పార్టీల నాయకులకు ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ నాయకులందరూ సహకరించాలన్నారు.

### తొలగించిన బ్యానర్లు మళ్లీ పెడితే ఖర్చు ఆయా పార్టీల ఖాతాలోకే : ఆర్డీవో వాణి



## నియమావళిని పాటించాలి : శ్రీదేవి

పామర్రు : అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల్ కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.శ్రీదేవి పేర్కొన్నారు. తన కార్యాలయంలో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలు, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సహయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులతోపాటు ఎన్నికల నియమావళి పర్యవేక్షక బృంద అధికార్లకు సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యాలయాల ఏర్పాటు, ప్రచార వాహనాలకు, మైక్‌లకు అనుమతులు తీసుకునేందుకు తమ కార్యాలయంలో సింగల్ విండో కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఎవరి వద్ద నైనా రూ.50 వేలకు మించి నగదు ఉంటే ఆధారాలు చూపించాల్సి ఉంటుందన్నారు. వివిధ పార్టీల నేతలు వల్లూరిపల్లి గణేష్, ఈడే గంటయ్య, కూనపరెడ్డి సుబ్బారావు, తాడిశెట్టిసాంబశివరావు, ముళ్లపూడి విల్సన్, పి. రాజు, రాజేంద్రప్రసాద్, సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే పోస్టింగులు పెడితే చర్యలు

అవనిగడ్డ : ఇతరుల వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే విధంగా సామాజిక మాధ్యమాల్లో రాజకీయ పోస్టులు పెడితే చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల అధికారి టి.బాలసుబ్రహ్మణ్యం హెచ్చరించారు. వివిధ రాజకీయ పార్టీల సోషల్ మీడియా ప్రతినిధులతో ఆర్వో సుబ్రహ్మణ్యం గురువారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఇతర పార్టీల వ్యక్తులను అగౌరవపరిచే విధంగా, ప్రతిష్టకు భంగం కలిగించేలా పోస్టులు ఉండరాదన్నారు. వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్ చేయాలంటే తప్పనిసరిగా అనుమతిపొందాలని సూచించారు. అనుమతి లేకుండా పోస్టింగ్ చేసే వీడియోలు, పోస్టింగులు అభ్యర్థి ఖర్చు కిందకు వస్తాయన్నారు. ఏఈఆర్‌వో కె.నాగమల్లేశ్వరరావు, ఇతర సిబ్బంది, పాల్గొన్నారు.

### ప్రకటన

సదరు నా క్లయింటు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజారు బ్రాంచి, మచిలీపట్నం వారి తరుపున యావన్మందికి తెలియజేయునది ఏమనగా మచిలీపట్నంటౌన్, సుకర్లాబాద, డోరు నెం.18/383 రు కాపురస్తులు అబ్దుల్ (లేటు) గని గారి కుమారుడు అబ్దుల్ జమీల్ గారు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని హామీగా వుంచి లోను నిమిత్తము నా క్లయింటు బ్యాంకు వారిని సంప్రదించియున్నారు. వారి పంజాయిషీ ప్రకారం అబ్దుల్ గని గారికి తండ్రిగారైన అబ్దుల్ రజాక్ సాహెబ్ గారు సదరాస్తిని అబ్దుల్ జలీల్ గారి వద్ద ద.నెం.948/1968రుగా క్రయం పొందియున్నారు. దరిమిలా సదరు అబ్దుల్ రజాక్ సాహెబ్ గారు మరియు వారి భార్య జమీలున్నీసా గారు సదరాస్తిని గురించి ఎట్టి వీలునామా పత్రములు వ్రాయకుండా ఇంటెస్టేట్‌గా మరణించినారు. వారల మరణానంతరం సదరాస్తి వారి వారసులైన అబ్దుల్ మజీద్, సాబిరున్నీసా, అబ్దుల్ రషీద్, అబ్దుల్ రహీం గారలకు జాయింటుగా సంక్రమించిన దరిమిలా 1984 సం.లో వారందరూ మాజువాణీగా విభజించుకొనగా యీ దిగువ షెడ్యూలు ఆస్తి అబ్దుల్ మజీద్, సాబిరున్నీసా మరియు అబ్దుల్ గనిల జాయింటు వాటాకు వచ్చియున్నది. దరిమిలా అబ్దుల్ మజీద్, సాబిరున్నీసా గారలు వారికి గల 2/3 వంతు వాటా ఆస్తిని అబ్దుల్ గని గారికి వదులుకొని ద.నెం.4220/2008 రుగా హక్కు విడుదల దస్తావేజు వ్రాయించియున్నారు. దరిమిలా సదరు అబ్దుల్ గని గారు దీ.15-07-2008వ తేదీన వీలునామాను వ్రాయించి మరణించినారు. వారి మరణానంతరం సదరు వీలునామాలోని ఏర్పాట్లు ప్రకారం అబ్దుల్ జమీల్, అబ్దుల్ కలామ్, అబ్దుల్ రజాక్, అబ్దుల్ షఫీక్, షాహెదాబేగం, జరీనాబేగం గారలకు జాయింటుగా సంక్రమించిన సదరాస్తిలో అబ్దుల్ కలామ్, అబ్దుల్ రజాక్, అబ్దుల్ షఫీక్, షాహెదాబేగం, జరీనాబేగం లకు గల 5/6వ వంతు ఆస్తిని అబ్దుల్ జమీల్‌కు వదులుకొని ద.నెం.5090/2009రుగా హక్కు విడుదల దస్తావేజు వ్రాయించియున్నారు. కావున యీ దిగువ షెడ్యూలు ఆస్తికి పైన తెలిపిన వారు గాక ఇంకెవరైనా హక్కుదారులు, వారసులు, మరియు ఎవరికైనా హక్కులు, అభ్యంతరములు వున్న యెడల యీ ప్రకటన జారీ చేసిన 10 రోజులలోపు అభ్యంతరములు తెలుపవలెను. లేనియెడల సదరు దిగువ షెడ్యూలు ఆస్తి నిరివాదమైన ఆస్తి అని గుర్తించబడును. షెడ్యూలు ఆస్తి : కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, మచిలీపట్నంటౌన్, మాచవరం, సుకర్లాబాద, మున్సిపల్ పాతవార్డు నెం.16, దర్జిల్లా -19, ప్రస్తుత వార్డు నెం.18రు డోరు నెం.18/383రు గల రేకులషెడ్డు యిల్లు, స్థలమునకు హద్దులు : తూర్పు: అబ్దుల్ సలామ్ గారి యిల్లు స్థలం వారి ప్రహరీగోడ అ.46-6 లు. దక్షిణం : సిద్దిక్ అహమ్మద్ గారి యిల్లు స్థలం వారి ప్రహరీగోడ అ.28-0 లు పడమర: పూసంటి శేషావతి గారి యిల్లు స్థలం వారి ప్రహరీగోడ అ.47-6 లు ఉత్తరం: ఈ ఆస్తి ప్రహరీగోడ అవతల మున్సిపల్ రోడ్డు అ.33-0 లు. యీ హద్దుల మధ్య 159.27 చ.గ. లు లేక చ.మీ. 133.149లు నేమి అందుగల రేకులషెడ్డు యిల్లు, టాయిలెట్స్ వగైరాల యావత్తు కలప సామానులతో సహా.

మచిలీపట్నం
ది.21-03-2024

తాతా రవి, న్యాయవాది
డో.నెం. 18/157 సుకర్లాబాద్, మచిలీపట్నం. సెల్ : 9440014666




తహసీల్దార్ కార్యాలయం వద్ద తమిరిశ, జనార్దనపురం రైతుల ధర్నా

## ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలి

నందివాడ : జనవరిలో మిల్లులకు రైతులు తోలిన ధాన్యం డబ్బు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం డివిజన్ కార్యదర్శి ఆర్‌సిపి.రెడ్డి డిమాండ్ చేశారు. నందివాడ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మురళీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద తమిరిశ, జనార్దనపురం రైతులు గురువారం ధర్నా చేశారు. ఆర్‌సిపి.రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు ఆర్‌బీకేల ద్వారా జనవరి నెలలో తోలిన ధాన్యానికి ఇంత వరకు నగదు చెల్లించ తీవ్ర ఇబ్బందుల పడుతున్నారన్నారు. ధాన్యం సొమ్ము తక్షణం చెల్లించాలని, దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ తహసీల్దార్ నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. జనార్దనపురం, తమిరిశ రైతులు పాల్గొన్నారు.



## బ్యాంకు ఎదుట ఖాతాదారుల నిరసన

చల్లపల్లి : మేనేజర్ వ్యవహార శైలికి నిరసనగా ఖాతాదారులు గురువారం చల్లపల్లి ఇండియన్ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, జనసేన జిల్లా సహాయ కార్యదర్శి ఉస్మాన్ షరీఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మీర్ రిజ్వాన్‌లు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఖాతాదారుల అకౌంట్లలో జమ అయిన ప్రభుత్వ సంక్షేమ పథకాల సొమ్మును సకాలంలో ఇవ్వకుండా మేనేజర్ డ్వాక్రా రుణ చెల్లింపులకు ముడిపెట్టి, అదనపు మొత్తాన్ని జమచేయాలంటూ ఒత్తిడి తీసుకువస్తున్నారని మండిపడ్డారు. మేనేజర్‌పై చర్యలు తీసుకోకుంటే బ్యాంకు ఎదుట దీక్షలు చేపడతామని హెచ్చరించారు. డ్వాక్రా రుణం తీసుకున్న తాము రూ.4100 చొప్పున చెల్లిస్తున్నామని, రుణమాఫీ డబ్బు ఇవ్వాలంటే రూ.5వేల చొప్పున ఖాతాలో జమచేయాలని షరతు విధించారని జమ్మిలంకమ్మ తల్లి గ్రూపు సభ్యులు తెలిపారు. తన భర్తకు అరోగ్య సమస్యలు ఉండటంతో ప్రైవేటు ఫైనాన్స్ దగ్గర డబ్బులు తీసుకుంటే ఖాతాలోంచి సొమ్ము తీసుకోకుండా స్తంభింపజేశారని పెదప్రోలుకు చెందిన సుజాత ఆవేదన వ్యక్తం చేశారు.

# సమస్యల పరిష్కారానికి శ్రమిస్తా

● టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, మార్చి 21 : నియోజకవర్గ ప్రజల కష్టాలను రూపు మాపేందుకు తాను కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైతే చంద్రబాబు ఇంటి ముందు పడుకొని అయినా సరే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు.

బాబు ష్యూరిటీ భవిషత్ గ్యారెంటీ కార్యక్రమం గురువారం శేరిదగ్గుమిల్లి, చింతలగుంట, కట్టానిచెరువు గ్రామాల్లో నిర్వహించారు. ప్రజలకు తాను అండగా ఉంటానని ఆ యన హామీ ఇచ్చారు. గుడివాడ నియోజకవర్గంలో యువతకు ఉపాధి బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు, మండల టీడీపీ అధ్యక్షుడు కొనసరాజు బాపయ్య చౌదరి, బీజేపీ నాయకులు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, గుడివాడ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్ర బాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బుల్లా కింగ్, కొడాలి రామరాజు, రామకృష్ణ, ఈడే మోహన్, వెంకయ్య, ఈడే శ్రీనివాసరావు, బెజవాడ సుబ్బయ్య, శివకుమార్, భాస్కరరావు, ఆదిశేషు, రాంబాబు, యార్లగడ్డ నాని, లుక్కా చంద్రశేఖర్ , జంగం మోహనరావు, బెల్లంకొండ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



వెనిగండ్లకు హారతి పడుతున్న మహిళలు



రాజీవ్‌నగర్ కాలనీలో కృష్ణప్రసాద్ ప్రచారం

## కార్మికులకు అండగా ఉంటా

గుడివాడ : కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో గురువారం ముఠా కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెనిగండ్లకు ముఠా కార్మిక సంఘాల నాయకులు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. వెనిగండ్ల మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, కుల వృత్తుల కార్మికులను రోడ్డున పడేసిన జగన్‌రెడ్డిని ఇంటికి పంపే సమయం ఆసన్నమైందన్నారు. సంపదను సృష్టించి, అన్ని వర్గాల వారికి ఉపాధి కల్పించడంలో, వాటిని పేదలకు వినియోగించడంలో చంద్రబాబు ముందుంటారన్నారు.

పెడన : వైసీపీ అసమర్థ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో అట్టడుగు స్థాయికి దిగజారిందని పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ విమర్శించారు. రాజీవ్‌నగర్ కాలనీ, తూర్పుతెలుగుపాలెం, సింగరాయపాలెం, కట్లపల్లి తదితర ప్రాంతాలలో గురువారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ప్రజలు సమస్యలను ప్రస్తావించి పరిష్కరించాలని కోరారు. బొడ్డు వేణుగోపాలరావు, సాదరబోయిన ఏడుకొండలు, పోతార్లంక నాగేశ్వరరావు, అబ్దుల్ ఖయూం, యక్కల శ్యామలయ్య, హమీదుల్లా, పరసా సూర్యనారాయణ, బెజవాడ నాగరాజు, మట్టా శివపావని, నాని, వరుదు రాము, పత్తిపాటి జయకృష్ణ, మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, కొల్లూరి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బార్ అధ్యక్ష పదవి పోటీలో మాదివాడ, బూరగడ్డ

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి పోటీలో టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు మాదివాడ నరసింహారావు, పెడన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బూరగడ్డ అశోక్‌కుమార్ నిలిచారు. బార్ అసోసియేషన్‌కు ఉపాధ్యక్షులు, ట్రెజరర్, కార్యదర్శి కార్యవర్గ సభ్యుల పదవులన్నీ ఏకగ్రీవమైనప్పటికీ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగక తప్పడం లేదు. నామినేషన్లు దాఖలు చేసిన బూరగడ్డ అశోక్‌కుమార్, మాదివాడ నరసింహారావు ఉపసంహరించుకోకపోవడంతో ఎన్నిక అనివార్యమయింది.



## రైతు సమస్యలు పరిష్కరించాలి

బంటుమిల్లి : రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని రైతు సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల రైతు సంఘం అధ్యక్షుడు మలిశెట్టి శివరామ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లడుతూ సార్వా ధాన్యం తొలి మూడు నెలలు గడుస్తున్నా, 15 వేల మంది రైతులకు రూ.3 కోట్ల బకాయి ప్రభుత్వం విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిచాంగ్ తుఫాను నష్ట పరిహారం బటన్ నొక్కినప్పటికీ రైతుల ఖాతాలో పడలేదన్నారు. అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. అజయ్‌ఘోష్, సూరిబాబు, పరంధామయ్య, వెంకట విష్ణు, నాంచారయ్య, మహా లక్ష్మయ్య శ్రీనివాసరావు, రమేష్ బాబు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ సుగుణాకరరావు మృతి



సుగుణాకరరావు (ఫైల్)

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు బొడ్డు సుగుణాకర రావు (చిన్ని) (49) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే డివై దాస్, పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా, గురుమూర్తి, పలువురు నాయకులు సుగుణాకరరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. చిన్నికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.




## జనసేన చలివేంద్రాలు ప్రారంభం

మచిలీపట్నం టౌన్ : జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పలు కూడలి ప్రాంతాల్లో చలివేంద్రాలు ప్రారంభించారు. మూడో డివిజన్‌లో ఊచా చంటి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ, శీతల పానీయాలు పంపిణీ చేశారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, ఉపాధ్యక్షుడు మహమ్మద్ సమీర్, మణిబాబు, శాయన శివ, తోట భాస్కర్, ఉడుముల బుజ్జి, మోకా రవి, లంకే శ్రీనివాస్, శ్రీకాంత్, రామ్ జ్యోతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ. 3.57 లక్షలు

మచిలీపట్నం టౌన్ : రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ కానుకలు గురువారం లెక్కించారు. రూ. 3,57,678 ఆదాయం వచ్చినట్టు ఈవో సుబ్బారెడ్డి తెలిపారు.

## మైత్రీ ఫౌండేషన్ సాయం

మచిలీపట్నం టౌన్ : కృష్ణా విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న ఇమ్రాన్ బాషా ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మంచానికి పరిమితమైన నేపథ్యంలో పరాసుపేటలో నివసిస్తున్న ఇమ్రాన్ బాషాకు మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు కె. వేణుకుమార్ ఆర్థికంగా సాయం అందించారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. రామకృష్ణ, అయ్యప్ప, తోకల రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన పెరగాలి

పామర్రు : డౌన్ సిండ్రోమ్ జన్యుపరమైన రుగ్మత అని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి.సురేష్ చంద్రారెడ్డి అన్నారు. కేడీబీ ట్రస్టులో వరల్డ్ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం నిర్వహించారు. ప్రత్యేక అవసరాల చిన్నారులకు కేడీబీ ట్రస్టు అందిస్తున్న సేవలను వివరించారు. ట్రస్టు కార్యదర్శి కాశీనాధుని నాగేశ్వరరావు, మొవ్వ ఐసీడీఎస్ సూపరవైజర్ పుణ్యవతి, అబ్దుల్ సలీం మున్నీసా, ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు. చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



## భుజంగేశ్వరస్వామి పునఃప్రతిష్ఠా మహోత్సవాలు

మచిలీపట్నం టౌన్ : ఖొజ్జిల్లిపేట జొన్నవిత్తుల వారి వీధిలోని భుజంగేశ్వర స్వామి ఆలయంలో పునః ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మరకత శివలింగానికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. వేదపండితుడు గూడూరు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో చక్కా నాగేశ్వరరావు, రోజా రమణి, మధుభూషణ్ పూజలు, రుద్రహోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




## తపసిపూడిలో పద్మావతి విద్యార్థినుల సేవా శిబిరం

మచిలీపట్నం టౌన్ : యువతులు సామాజిక సేవాదృక్పథం పెంపొందించుకోవాలని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.అన్నపూర్ణ అన్నారు. తపసిపూడిలో కళాశాల విద్యార్థినులు ఏడు రోజులుగా ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం నిర్వహించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సర్వే చేశారు. వీధులు ఊడ్చి ప్రజలకు స్ఫూర్తినిచ్చారు. ఆరోగ్య సూత్రాలను వివరించారు. యువత మద్యపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ప్రోగ్రాం ఆఫీసరు మల్లికార్జునరావు వికసిత భారత్ నిర్మాణాన్ని వివరించారు. గ్రామ యువతీ యువకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్య

పామర్రు : పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన డి.నాగలక్ష్మి (32) అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడింది. తాన చావుకు ఎవరూ బాధ్యుల కాదని పేర్కొంటూ సెల్ఫీ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త పవన్ కూమార్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## ఆర్ట్ ఆఫ్ లివింగ్‌పై విద్యార్థులకు శిక్షణ

గుడ్లవల్లేరు : విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ తోడ్పతుందని చంద్రశేఖర్ పేర్కొన్నారు. డి.రాజేష్, రత్నమాల, హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, ప్రధానోపాధ్యాయులు జి.మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం స్వాధీనం

మచిలీపట్నం టౌన్ : చిన్నాపురంలో అక్రమంగా నిల్వ ఉంచిన 15 మద్యం సీసాలను ఎస్సై సిహెచ్. పద్మ స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తప్పిన ప్రమాదం

మచిలీపట్నం టౌన్ : మునిసిపల్ గార్బేజ్ ట్రాక్టర్ జిల్లా పరిషత్ సెంటర్‌లో గురువారం ఒక షాపులోకి దూసుకెళ్లింది. ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. ఎవరూ గాయపడలేదు.

## మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



మచిలీపట్నం టౌన్ : బచ్చుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మహన్యాస పూర్వక నమక చమకాలతో స్వామి వారికి అర్చనలు చేశారు. సహస్ర నామాలతో అమ్మవారిని అర్చించారు.



## రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

కూచిపూడి : కూచిపూడి బాలాత్రిపుర సుందరి దేవి సమే త రామలింగేశ్వరస్వామి కల్యా ణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారిని, అమ్మవార్లను పెండ్లి కుమారుడిని, పెండ్లి కుమార్తెను చేయటంతోపాటు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.